క్లుప్తంగా

ఇన్‌చార్జి కార్యదర్శిగా రామకృష్ణ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఊలపల్లి కార్యదర్శి రామకృష్ణ నియమితులైనట్టు సర్పంచ్ బుంగా రామారావు గురువారం తెలిపారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు సస్పెండ్ కావడంతో, రామకృష్ణ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు.

రైతు కూలీ సంఘం జిల్లా నేత సత్తిరాజు మృతి



సత్తిరాజు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రంగంపేట: ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యుడు చెక్కా సత్తిరాజు(70) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఆయన భౌతికకాయాన్ని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, నాయకులు బి.రమేష్, కడితి సతీష్, మడికి సత్యం, దేశెట్టి సురేష్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్రీకాంత్ తదితరులు నివాళులర్పించారు. ప్రజా ఉద్యమాల్లో మూడు దశాబ్దాలుగా ఆయన చేసిన కృషి మరువలేనిదని నాయకులు కొనియాడారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం



గోకవరంలో కార్గో డోర్ డెలివరీ సర్వీసులను ప్రారంభిస్తున్న డీఎం రామన్నదొర

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను డిపో మేనేజర్ యు.రామన్నదొర గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 25 వరకూ నెల రోజుల పాటు కార్గో డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా డిపోలో కార్గోకు బుక్ చేసుకున్న వస్తువులు, ఇతర సామగ్రిని భద్రంగా ఇంటికే డెలివరీ చేస్తామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దసరాలో డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడం ద్వారా రూ.12.18 లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. దీనికి సహకరించిన సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ అడ్డాల అప్పారావు, పలు యూనియన్ల నాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో సదుపాయాల పరిశీలన

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె.ప్రత్యూష కుమారి గురువారం సెంట్రల్ జైలును సందర్శించారు. కారాగారం ఆసుపత్రిలో అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించి, న్యాయ సమస్యలున్న వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో గౌరవంగా జీవించాలన్నారు. మానసిక ఆరోగ్యం మెరుగుపర్చుకునేందుకు యోగా, ధ్యానం చేయాలన్నారు. అనంతరం కారాగారంలోని వంటశాల, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

గ్యాస్ సిలిండర్ల పట్టివేత

కంబాలచెరువు: గృహావసరానికి వాడే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వ్యాపారానికి ఉపయోగిస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇన్‌చార్జి రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ ఆదేశాల మేరకు శ్యామలా నగర్‌లోని విజయ అమృత హోటల్‌పై అధికారులు గురువారం దాడి చేశారు. అక్కడ గృహావసరానికి ఉపయోగించే ఐదు గ్యాస్ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హోటల్ యజమాని రాయుడు రాంబాబుపై కేసు నమోదు చేశారు. అలాగే హోటల్లో స్టాంప్ లేని తూనిక యంత్రం ఉపయోగిస్తున్నందున లీగల్ మెట్రాలజీ అధికారులు మరో కేసు నమోదు చేశారు. తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు లోవకుమార్, కిషోర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

సీటీఆర్ఐ: గౌతమీ జీవకారుణ్య సంఘంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు ఆ సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, డైరెక్టర్లు గురువారం రగ్గులు పంపిణీ చేశారు. వీటిని పలు సందర్భాల్లో దాతలు సమకూర్చారు. కొండబాబు మాట్లాడుతూ చలికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో వృద్ధులు ఇబ్బంది పడకుండా రగ్గులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్లు నాగులాపల్లి దేవీ లక్షణరావు, చొల్లంగి ఏడుకొండలు, పైడా వాసు, ఆఫీసు సిబ్బంది విజయ్ కుమార్, దత్తాత్రేయ పాల్గొన్నారు.

వేదిక ప్రాంగణం.. జనసంద్రం

- ఘనంగా జక్కంపూడి వివాహ రిసెప్షన్
- తరలివచ్చిన అభిమానులు



దివాన్‌చెరువు డీబీవీ రాజు లేఅవుట్‌లోని రిసెప్షన్ ప్రాంగణంలో కిక్కిరిసిన అభిమానులు

రాజానగరం: దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు కుమారుడు, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోదరుడు జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్‌కు భారీ ఎత్తున అభిమానులు తరలివెళ్లారు. దివాన్ చెరువులోని డీబీవీ రాజు లేఅవుట్‌లో గురువారం నిర్వహించిన ఈ వేడుకకు ఉమ్మడి గోదావరి జిల్లాల నుండి భారీ ఎత్తున అభిమానులు వచ్చారు. వారిలో అత్యధికులు రాజానగరం నియోజకవర్గం నుంచే కావడం విశేషం. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జక్కంపూడి రాజా తండ్రి బాటలోనే పయనిస్తూ, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. జక్కంపూడి కుటుంబంపై ఉన్న అభిమానంతో నియోజకవర్గ ప్రజలు గణేష్ వివాహ రిసెప్షన్‌కి పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. మారుమూల గ్రామాల నుంచి కూడా సొంత వాహనాలతో పాటు బస్సులు, ఆటోలలో వచ్చారు. వచ్చిన వారందరినీ జక్కంపూడి కుటుంబం సాదరంగా ఆహ్వానించింది. ఘనంగా ఆతిథ్యం ఇచ్చింది.



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



రాధేయపాలెం నుంచి జెడ్పీటీసీ వాసంశెట్టి వెంకన్న ఆధ్వర్యంలో బస్సులో పయనమైన జనం

అనపర్తి సీఐగా శివగణేష్



అనపర్తి: అనపర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.శివగణేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన అనపర్తి ఎస్సైగా పని చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని, వీటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.

ఘనంగా షిర్డీ సాయి పుణ్యతిథి ఆరాధన



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనపర్తి: శ్రీషిర్డీ సాయిబాబా పుణ్యతిథి ఆరాధనోత్సవాలు మండలంలోని సాయిబాబా ఆలయాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. బాబా మహాసమాధి పొంది 105 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ సత్తి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, రమాకుమారి దంపతులు పేదలు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు రెడ్డి సురేష్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సమితి ఉపాధ్యక్షుడు కర్రి వీర్రాఘవరెడ్డి, అంజిరెడ్డి, రెడ్డి సతీష్, జాహ్నవిరూపిణి, గంగా మోహనలక్ష్మి, వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబా సమాధి మహోత్సవాలు

మధురపూడి: బాబా సమాధి మహోత్సవాల ముగింపు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు ఆధ్వర్యంలో బూరుగుపూడి ప్రధాన వీధుల్లో బాబా వారిని ఊరేగించారు. దీనిలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంటే నాగేశవరావు, నాయకులు కంటే సత్యచక్ర గణపతి, మూతిన శివమోహన్, గూడపాటి వెంకటేశ్వరరావు, ఏవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. ఈనెల 24న ఈ ఉత్సవాలను ప్రారంభించిన విషయం తెలిసిందే.

జగన్ అండగా.. సాగు పండగ

- వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రైతులకు అన్నివిధాలా సాయం
- విత్తు నుంచి విక్రయం వరకూ భరోసా



మునగాలలో బస్తాల్లోకి నింపిన ధాన్యం



శ్రీరంగపట్నంలో వరిపంటను కోస్తున్న మిషన్

మధురపూడి: అన్నదాతకు అన్ని విధాలుగా చేదోడువాదోడుగా ఉంటూ, అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఆత్మబంధువుగా మారారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలను రాజులుగా చూడాలన్న ఆకాంక్షతో ప్రోత్సాహాన్నిస్తున్నారు. అందులో భాగంగా వ్యవసాయాన్ని పండగలా మార్చారు. విత్తు నుంచి విత్తనం వరకూ రైతులకు బాసటగా నిలుస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ధాన్యానికి మద్దతు ధర పెంచారు. దళారుల మోసాలకు గురి కాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరిగింది.

నియోజకవర్గంలో..

మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో నీటి సదుపాయాలు ఉండటంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఖరీఫ్‌లో 46, 539 ఎకరాల విస్తీర్ణంలో వరిని వేశారు. ఇక్కడి పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి అధికంగా సాగునీరందులోంది. చెరువులు కూడా రైతులకు ఉపకరిస్తున్నాయి. రబీ సీజన్‌లో సైతం సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో ఎంటీయూ 1,318, ఎంటీయూ 1,064, ఎంటీయూ 1,061, బీపీటీ 5,204, పీఎల్ఏ 1,100 రకాలను సాగు చేశారు. ఈ ప్రాంతంలో ఏటా వీటినే ఎక్కువగా పండిస్తారు.

సాగు వివరాలు

మండలం	పంట విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు	కొనుగోలు కేంద్రాలు
కోరుకొండ	13,030	7,385 మంది	17
రాజానగరం	10,583	8,746 మంది	15
సీతానగరం	12,926	4,725 మంది	11
మొత్తం	46,539	20,856 మంది	43

కొనుగోలు కేంద్రాలు

నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 43 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. తూకాల్లో మోసాలకు తావు లేకుండా, రైతన్నలకు అన్ని విధాలుగా చేదోడుగా ఉండాలన్న ప్రభుత్వ ఆదేశాలనుసారం కొనుగోలు నిర్వహిస్తున్నారు. కోరుకొండ మండలంలో 17, సీతానగరం మండలంలో 11, రాజానగరం మండలంలో 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏ గ్రేడు రకం క్వింటాల్ (100 కేజీలు)కు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర అందిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలతో మేలు



ప్రభుత్వం రైతన్నలకు అన్ని విధాలుగా అండగా ఉంటోంది. నియోజకవర్గంలో 43 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 20,856 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు జరిగాయి. – ఏ.గౌరీదేవి, వ్యవసాయాధికారి, కోరుకొండ

రైతులకు భరోసా



జగన్ ప్రభుత్వం రైతులందరికీ భరోసా కల్పిస్తోంది. విత్తు నుంచి విక్రయం వరకూ అన్ని రకాలుగా సాయం చేస్తోంది. అలాగే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. సాధారణ రకం ధాన్యానికి రూ.2.183, గ్రేడ్ ఏ రకానికి రూ.2,203 ప్రకటించడం బాగుంది. – మద్దాల రమణ, రైతు, శ్రీరంగపట్నం

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి



గుమ్మళ్లదొడ్డిలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



రోగులకు మందులు అందిస్తున్న సర్పంచ్ భద్రం



బాలవరంలో జరిగిన వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. వైద్య సేవలు పొందిన వారికి మందుల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సర్పంచ్ సరకణం రామలక్ష్మి, నాయకులు దాసరి సతీష్‌బాబు, సరకణం మురళీ, పి.చిన్ని, రామబ్రహ్మం, బూలా అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదల ఆరోగ్యానికి భరోసా ఏర్పడిందని సర్పంచ్ లోల భద్రం అన్నారు. గురువారం మండలంలోని ఇలపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 665 మంది ఈ అవకాశం వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యులు రాజీవ్, వైఎస్సార్ సీపీ నాయకుడు సాధనాల రాంబాబు పాల్గొన్నారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరమని ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి తెలిపారు. రామేశ్వరం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ కొటికలపూడి చినబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు మొత్తం 791 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి, గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, ఉప సర్పంచ్ కొటికలపూడి వరలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, మండల మహిళా విభాగం నాయకురాలు బసవ విజయకుమారి, ఏపీత్రయం సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు పాల్గొన్నారు.

రంగంపేట: పేదలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని మండల వైద్యాధికారి జి.రామ్‌భాస్కర్ అన్నారు. బాలవరం గ్రామంలో సర్పంచ్ గోలి రమణ ఆధ్వర్యంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరినీ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ షమ్మీకుమార్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ కె.మోనికాతేజ, డాక్టర్ సీహెచ్ఎస్ భాగ్యలక్ష్మి, డాక్టర్ సీహెచ్‌బీ సాయిహర్ష తదితరులు 456 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ తులసీరావు, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, పంచాయతీ కార్యదర్శి బి.గౌరీశాంతి, సీహెచ్ఓ కె.జయమణి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



దొడ్డిగుంటలో ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: అహర్నిశలు శ్రమించే రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, నల్లమిల్లిలో రూ.36 లక్షలు, సింగంపల్లిలో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాలు, పైపులైన్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ కేంద్రాలకు శాశ్వత భవనాలను ప్రతి గ్రామంలో నిర్మిస్తారని చెప్పారు. ధాన్యాన్ని ఈ ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తారని, ఎరువులు, పురుగు మందులూ ఇక్కడ లభించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం రూపొందించారని వివరించారు. ప్రతి గ్రామానికి మంచినీటి ఇబ్బందులు లేకుండా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, పైప్‌లైన్లు విస్తరణ చేస్తున్నట్టు తెలిపారు. జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, పార్టీ రాష్ట్ర చేనేత, రైతు విభాగం కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, నల్లమిల్లి, సింగంపల్లి, దొండిగుట సర్పంచ్‌లు నల్లా పద్మ, తుట్టా శివశంకర ఆనంద్, కారి సంజీవరావు, పీఆర్ జేఈ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు జాబితా ప్రదర్శన



దోమాడ రైతు భరోసా కేంద్రంలో జాబితాను ప్రదర్శిస్తున్న దృశ్యం



కోరుకొండ ఆర్‌బీకే-2లో జాబితాను ప్రదర్శిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

పెదపూడి: మండలంలో పూర్తయిన ఈ–క్రాప్ నమోదు జాబితాలను సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుంచి ప్రదర్శనకు ఉంచామని మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 17,900 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారన్నారు. ఈ పంట మొత్తం ఈ–క్రాప్ నమోదు పూర్తి చేశారన్నారు. ఈ జాబితాలను సామాజిక తనిఖీ కోసం ఈ నెల 29 వరకూ రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తారన్నారు. అలాగే గ్రామసభలు నిర్వహించి, ముసాయిదా జాబితాలో ఉన్న ఈ–క్రాప్ నమోదు వివరాలను వెల్లడిస్తారని తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే రైతులు లిఖితపూర్వకంగా గ్రామ వ్యవసాయ సహాయకుడికి అందజేయాలని కోరారు.

ఈ–క్రాప్ జాబితా ప్రదర్శన

మధురపూడి: కోరుకొండ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 13,025.94 ఎకరాల పంట సాగుకు ఈ–క్రాఫ్ పూర్తయినట్టు వ్యవసాయశాఖ జిల్లా అధికారి మాధవరావు తెలిపారు. కోరుకొండలోని ఆర్‌బీకే-2 కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలూ అందుతున్నాయన్నారు. ఈ–క్రాఫ్ ముసాయిదా జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామన్నారు. దానిలో భాగంగా కోరుకొండ ఆర్‌బీకే-2లో ముసాయిదా జాబితాను ప్రదర్శనకు ఉంచామన్నారు. రైతులు క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ బీకే మల్లికార్జునరావు, ఏఓ గౌరీదేవి, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీచౌక్ కనకదుర్గమ్మ ఊరేగింపు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ ఊరేగింపు గురువారం కన్నులపండువగా జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూలరథంపై అమ్మవారిని తీన్‌మార్ డ్యాన్స్‌లు, డీజే సౌండ్స్, కాంతారా, వివిధ దేవతల వేషధారణలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు గ్రామంలోని ప్రధాన రహదారి గుండా తెల్లవారుజాము వరకూ సాగింది. ఊరేగింపులో బిక్కవోలు వారి బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



గోకవరంలో పూలరథంపై కనకదుర్గమ్మను ఊరేగిస్తున్న భక్తులు







ఊరేగింపులో అలరించిన కాంతారా డ్యాన్స్, శక్తి వేషాలు, గరగ నృత్యాలు